# సామ్రాజ్యవాద విత్తన కంపెనీల ప్రయోజనాల కోసమే కేంద్రప్రభుత్వ నూతన విత్తన చట్ట ముసాయిదా

**కేంద్రప్రభుత్వం** 2019 విత్తన చట్టం ముసాయిదాను నవంబర్ 1న విడుదలచేసి, దానిపై 15 రోజులలోపు సూచనలు, సలహాలు, సవరణలు పంపాలని, వెబ్‌సైట్‌లో పెట్టటమే ముసాయిదాపై కేంద్రం లోతైన చర్చను కోరుకోవటం లేదని వెల్లడిచేస్తోంది. కేంద్రం అనుసరించిన మొక్కుబడి విధానంపై విమర్శలతోపాటు ముసాయిదాపై చర్చ ప్రారంభమైంది.

దేశంలో 1966 సం॥వరకు విత్తన చట్టం అంటూ ఏదీ లేదు. పండించిన పంట నుండే తిరిగి రైతాంగం విత్తనం కట్టుకోవటం లేదా పక్కరైతు పంటనుండి తీసుకోవటం జరిగేది. ఇందువలన విత్తన వ్యాపారమంటూ దాదాపుగా లేదు. ఉన్నా నామమాత్రమే. దేశంలో ఏర్పడిన ఆహార సంక్షోభ పరిస్థితుల్లో అధిక ఉత్పత్తి కోసమంటూ 1966లో కేంద్రప్రభుత్వం హరితవిప్లవాన్ని ప్రకటించింది. అందుకోసం విదేశాల నుండి విత్తనాల దిగుమతికోసం మరియు విదేశీ విత్తన సంస్థల ప్రయోజనాలను కాపాడటంకోసం 1966లో తొలిసారిగా కేంద్రం విత్తన చట్టం చేసింది. ఈ చట్టంలోని నిబంధనలు చాలా సరళంగా వున్నాయి. నాసిరకం విత్తనాల సమస్య ఏర్పడినప్పుడు రైతులు వ్యవసాయ అధికారికి ఫిర్యాదుచేస్తే, రాష్ట్రస్థాయి కమిటి పరిశీలనచేసి తగిన చర్యలు తీసుకొంటుందని చట్టంలో పేర్కొన్నారు.చట్టంలోని బలహీనతలను అడ్డం పెట్టుకొని, ముఖ్య అధికారులను ప్రలోభాలకు గురిచేసి కొద్దిపాటి జరిమానాతో విత్తన వ్యాపారసంస్థలు, కంపెనీలు తప్పించు కొన్నాయి. చాలా అరుదుగా మాత్రమే కొన్ని సంస్థల లైసెన్స్‌లు రద్దుచేశారు. ఆ సంస్థలు కూడా మారుపేర్లతో అవే విత్తనాలను తయారు చేసి మార్కెట్‌లో అమ్మాయి.

దేశంలో సరళీకృత ఆర్థికవిధానాల అమలు, ప్రపంచవాణిజ్య ఒప్పందంపై సంతకం చేయటంతో భారత వ్యవసాయరంగంపైన, విత్తనరంగంపైన సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల పట్టు పెరిగింది. విత్తన వ్యాపారానికి భారతదేశాన్ని మంచివనరుగా బహుళజాతి సంస్థలు భావించాయి. విత్తన వ్యాపారం ద్వారా దేశంనుండి లాభాలు తరలించుకుపోవటానికి బహుళజాతి సంస్థలు పోటీపడుతూ వున్నాయి. ఇందులో మోన్‌శాంటో అగ్రస్థానంలో వుంది. ఇది బి.టి విత్తనాలను పెద్దఎత్తున ఉత్పత్తిచేస్తూ వాటి అమ్మకాలను కొనసాగిస్తున్నది. బి.టి. పత్తి విత్తనాల అమ్మకాలకు భారతదేశం ముఖ్య కేంద్రంగా మారింది. మోన్‌శాంటో, డుపాయింట్, సింజెంటా, కార్గిల్‌లాంటి కంపెనీలు మన దేశంలో 30శాతం దాకా విత్తనాలు అమ్ము తున్నాయి. 2004లో బహుళజాతి సంస్థలు దేశంలో 5వేల కోట్ల రూ॥ల విత్తన వ్యాపారం చేయగా నేడు అది 15వేల కోట్లకు చేరింది.

మోన్‌శాంటో ప్రచారం చేసినట్లు బిటి విత్తనాల వలన దిగుబడులు పెరగలేదు; చీడపీడలు నివారణ కాలేదు. ఉత్పత్తి ఖర్చులు తగ్గకపోగా పెరిగాయి. నకిలీ విత్తనాల వలన ఉభయ తెలుగురాష్ట్రాల్లో 5లక్షల 60వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. బిటి విత్తనాలకన్నా సాంప్రదాయ విత్తనాలతోనే దిగుబడి ఎక్కువగా వచ్చిందని అనేక సర్వేలు వెల్లడించాయి. బహుళజాతి సంస్థలపైనా, నకిలీ విత్తన వ్యాపారులపైనా ఆగ్రహంతో వున్న రైతులు, నకిలీ విత్తన షాపులపై దాడులు చేశారు. ప్రభుత్వంపై తీవ్రవ్యతిరేకతను వ్యక్తం చేశారు.

నాణ్యతలేని నకిలీ విత్తనాలపై రైతాంగం ఆగ్రహంతో వున్న నేపథ్యంలో దాన్ని చల్లార్చటానికి కొత్త విత్తన చట్టం తీసుకొస్తున్నట్లు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రకటించి 2004 కొత్తవిత్తన ముసాయిదా బిల్లును శాసనసభలో ప్రవేశ పెట్టింది. సభ ఆమోదం పొందిన చట్టాన్ని కేంద్రం ఆమోదంకోసం పంపింది. వ్యవసాయరంగం రాష్ట్రాల పరిధిలోనే వున్నా, విత్తన చట్టంచేసే అవకాశం రాష్ట్రప్రభుత్వాలకు వున్నా, ఆ చట్టం కేంద్రం ఆమోదం పొందితేనే అమల్లోకి వస్తుంది. రాష్ట్రవిత్తన చట్టాన్ని ఆమోదించినట్లుగాని, ఆమోదించనట్లుగాని ఇంతవరకు కేంద్ర పాలకులు తెలపలేదు.

నకిలీ విత్తనాలకు, బహుళజాతి సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు తీవ్రం కావటంతో యుపిఏ ప్రభుత్వం కొత్త విత్తన ముసాయిదా బిల్లును 2004లో రాజ్యసభలో ప్రవేశపెట్టి, దాన్ని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపింది. ముసాయిదా బిల్లును స్టాండింగ్ కమిటీ అధ్యయనం చేసి అనేక సిఫార్సులతో 2006లో కేంద్రప్రభుత్వానికి అందజేసింది. విదేశాలనుండి దిగుమతి అయ్యే విత్తనాలను 21 రోజులపాటు క్వారంటైన్‌లో పెట్టి, పరిశోధనలు జరిపి, దేశ వాతావరణ పరిస్థితులకు సరిపోతాయని నిర్ధారించిన తర్వాతనే రాష్ట్ర సంస్థలు ధృవీకరణ పత్రం ఇవ్వాలని, నాసిరకం విత్తనాలను విక్రయించిన వారిపై 2 లక్షల నుండి 10 లక్షలవరకు జరిమానా, సంవత్సరం జైలుశిక్ష విధించాలని స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు లన్నింటినీ ప్రక్కనపెట్టి, బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా, రైతాంగ ప్రయోజనాలను బలిపెడుతూ కొన్ని సవరణలతో 2004 విత్తన ముసాయిదా బిల్లును తిరిగి 2006లో ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లులో రైతాంగ వ్యతిరేకమైన ప్రమాదకర అంశాలు వున్నాయి.

ఈ బిల్లు ఆమోదం పొందితే రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు చాలా కుదించివేయ బడతాయి. బిల్లులోని సెక్షన్ 3

ప్రకారం దేశస్థాయిలో ఢిల్లీ కేంద్రంగా విత్తన కమిటీ ఏర్పాటు అవుతుంది. కమిటీ అధ్యక్షుణ్ణి, సభ్యులను కేంద్రమే నియమిస్తుంది. రాష్ట్రాలకు ప్రాతినిధ్యం నామమాత్రంగానే వుంటుంది. ఐదు భౌగోళిక జోన్లలో ఒక్కోసారి ఒక జోన్ నుండి ఒక ప్రతినిధిని రొటేషన్ పద్ధతిలో నియమిస్తుంది. రాష్ట్రస్థాయి కమిటీలు ఏర్పాటు అయినా వాటికి పరిమిత అధికారాలే వుంటాయి. చట్టం అమలులో కేంద్రం నియమించిన కమిటీకే అన్ని అధికారాలూ వుంటాయి. విత్తన ఉత్పత్తి, ప్రణాళిక, ఎగుమతి, దిగుమతులు, రిజిస్ట్రేషన్ ప్రమాణాలు, విత్తన ధృవీకరణ పరీక్షలు మొదలైన అంశాలపై కేంద్రప్రభుత్వానికి ఈ కమిటీ సూచనలు చేస్తుంది. వ్యవసాయరంగం పైన, విత్తనరంగంపైన కేంద్రానికి అధికారం కల్పించటంద్వారా రాష్ట్రాలకు వున్న అధికారాలు రద్దు అవుతాయి.

విత్తన తయారీ సంస్థలు, తాము యిచ్చే విత్తనాలు ఏ మేరకు ఫలితాలు ఇస్తాయో ముందుగా తెలియజేయాలనీ, తెలియచేసిన మేరకు ఫలితాలు రాకపోతే వినియోగదారుల హక్కుల(1966)చట్టం కింద రైతులు పరిహారం కోరవచ్చని రెండవసారి రాజ్యసభలో ప్రవేశ పెట్టిన 2004 విత్తన ముసాయిదా బిల్లులో వుంది. వినియోగదారుల ఫోరం వద్దకు వెళ్లటం రైతులకు శక్తికి మించినదిగా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని పిపివిఎఫ్ఆర్ (2001) చట్టం స్పష్టంగా చెబుతున్నా ప్రభుత్వం దాన్ని అమలుచేయటం లేదు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. పంటలు నష్టపోయిన రైతులకు పంట విలువతో కూడిన నష్టపరిహారం ఇస్తారా, కేవలం విత్తన ఖరీదును ఇస్తారా అన్న దాన్ని ముసాయిదాలో చెప్పలేదు.

నష్టపరిహారంతోపాటు జైలు శిక్షలను కూడా ముసాయిదా బిల్లులో పేర్కొన్నారు. నాణ్యతలేని, నకిలీ విత్తనాలు విక్రయించిన వారికి మొదట 5వేల నుండి 25 వేల రూపాయల వరకు జరిమానా, తప్పుడు సమాచారం, రిజిస్ట్రేషన్ లేని విత్తనాలు అమ్మిన వారికి ఆరునెలల జైలుశిక్ష యాభైవేల జరిమానా అని ముసాయిదాలో మొదట పేర్కొన్న దానిపై విమర్శలు రావటంతో రెండవసారి ప్రవేశపెట్టిన ముసాయిదాబిల్లులో లక్షరూపాయల జరిమానా లేక ఆరునెలల జైలుశిక్షగా సవరణ చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 2 నుండి పదిలక్షలవరకు జరిమానా, ఏడాది జైలుశిక్షగా సిఫార్సు చేసింది.

విత్తన వ్యాపారం చేసే ఎవరైనా రాష్ట్ర విత్తన ధృవీకరణ ఏజన్సీల ద్వారా లేదా గుర్తింపు పొందిన సంస్థలనుండి ధృవీకరణ పొందవచ్చు. గుర్తింపు పొందిన సంస్థలు, తమకు తాముగా గుర్తింపు పొందవచ్చని ముసాయిదాలో పేర్కొనటంతో తీవ్ర విమర్శలు, వ్యతిరేకత వ్యక్తం కావటంతో రాష్ట్రసంస్థలే గుర్తింపు ఇవ్వాలని రెండవసారి ప్రవేశపెట్టిన దానిలో సవరించటం జరిగింది. మొదటిసారి ప్రవేశపెట్టిన దానిలో కేంద్రప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సుల మేరకు విదేశాల్లో విత్తన ధృవీకరణ సంస్థలను కూడా గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి అవకాశం ఇవ్వటంవలన విదేశీ విత్తన కంపెనీలు భారత చట్టాలకు కట్టుబడాల్సిన అవసరం వుండదు. దీనిపై తీవ్ర ఆందోళన బయలు దేరింది. రెండవసారి ప్రవేశపెట్టినదానిలో 'విదేశీ'కి బదులు 'భారత భూభాగానికి వెలుపల' అని సవరణ చేశారు. రెంటికీ అర్థంలో తేడాలేదు. ఈ బిల్లు చట్టంగా మారితే విదేశీ విత్తన కంపెనీలు తమకు తాముగా ధృవీకరణ ఇచ్చుకోవచ్చు. ఇలా చెప్పటమంటే బహుళజాతి సంస్థల ఒత్తిడికి తలవంచటమే.

ప్రస్తుతం అమల్లో వున్న 1966 విత్తన చట్టంలో జన్యుమార్పిడి విత్తనాల ప్రస్తావనే లేదు. 2004 విత్తన ముసాయిదా బిల్లులో పర్యావరణ చట్టం క్రింద (1966) ముందస్తు అనుమతి పొందిన జన్యుమార్పిడి విత్తనాలను మాత్రమే రిజిస్టర్ చేస్తారని పేర్కొన్నారు. అలా అనుమతి పొందిన వాటిని కంపెనీ నిర్దేశించిన ప్రయోగ ఆధారాల మేరకు రెండేళ్ళకాలం రిజిస్టర్ చేస్తారని పేర్కొనటం జరిగింది. రెండవసారి ప్రవేశపెట్టిన దానిలో రెండేళ్ళ రిజిస్టర్ నిబంధనను తొలగిస్తూ సవరణ చేశారు. ఈ సవరణ ద్వారా విదేశీ విత్తన సంస్థలు ప్రయోగాల ఆధారాలు చూపకుండానే విత్తన సంస్థలను రిజిస్టర్ చేసుకోవచ్చు.

2004 విత్తన ముసాయిదా బిల్లుకు స్వల్ప సవరణలు చేసి ప్రవేశపెట్టిన దానిఎడల రైతాంగంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తంకావటం, రైతు, రైతుకూలీసంఘాలు, వ్యవసాయ నిపుణులు - ఇది రైతాంగ వ్యతిరేకమైందని దుయ్యబట్టటంతో దానికి చట్టబద్ధత ఇవ్వకుండా ప్రక్కనబెట్టింది. 1966 చట్టమే ఆచరణలో అమలు జరుగుతూ వచ్చింది. కొత్త విత్తన చట్టంద్వారా రైతుల ప్రయోజనం కాపాడాలనే నినాదం,ఆందోళనలు నిరంతరం కొనసాగుతూనే వున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో 2010లో పార్లమెంటరీ స్థాయి సంఘం సూచనల దృష్ట్యా యుపిఏ ప్రభుత్వం విత్తనబిల్లు ముసాయిదాకు తుదిరూపం ఇచ్చేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాల సూచనలను కోరింది. రాష్ట్రప్రభుత్వాల సూచనలను కోరినప్పటికీ, ఏకపక్షంగా పాత ముసాయిదాకు స్వల్ప మార్పులుచేసి 2010 విత్తనబిల్లును రూపొందించారు. ఇందులో పొందుపర్చిన నిబంధనలు కూడా విత్తన కంపెనీల ప్రయోజనాలను పరిరక్షించేవిగానే వున్నాయి. రైతులు, రైతు-కూలీ సంఘాలనుండి వ్యతిరేకత రావటంతో ఈ బిల్లు కూడా చట్టంరూపం దాల్చలేదు.

రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించే విధంగా విత్తనచట్టం చేయాలని ఆందోళనలు నిరంతరం జరుగుతూనే వున్నాయి. 9 సంవత్సరాల తర్వాత మోది ప్రభుత్వం విత్తన బిల్లు ముసాయిదాను విడుదల చేసింది. ఇది 2004 ముసాయిదా బిల్లుకు నకలు మాత్రమే. మౌలిక విధానాలన్నీ ఒకేవిధంగా వున్నాయి.

2019 విత్తన బిల్లులోని కొన్ని అంశాలను పరిశీలిద్దాం. నాణ్యత, విత్తన స్వచ్ఛత నూరు శాతం, మొలక 80శాతం వుండాలి. విదేశాల నుండి దిగుమతి చేసుకొనే విత్తనాలను 21 రోజులపాటు క్వారంటైన్‌లో పెట్టి, పరిశోధనలు చేసి దేశ వాతావరణ

పరిస్థితులకు సరిపోతాయని నిర్ధారించిన తర్వాతనే రాష్ట్ర సంస్థల ధృవీకరణ ఇవ్వాలని 2004 సవరణ ముసాయిదాలో చెప్పగా, ఆ స్పష్టత ఈ ముసాయిదా చట్టంలో లేదు. విత్తన నాణ్యత లోపించినప్పుడు విత్తన అమ్మకందార్లకు, కంపెనీలకు 25వేల నుండి ఐదు లక్షలవరకు జరిమానా, గరిష్టంగా ఏడాది జైలుశిక్ష లేదా రెండూ విధించవచ్చని 2019 ముసాయిదా చెబుతున్నది. జరిమానా పరిమాణం 2004 ముసాయిదాకన్నా తక్కువగా వుంది.

నాసిరకం విత్తనాల వలన రైతాంగం నష్టపోతే విత్తన అమ్మకందార్ల నుండి 1986 వినియోగదారుల చట్టం క్రింద రైతాంగం పరిహారం పొందవచ్చని 2019 విత్తన ముసాయిదా చట్టంలో చెప్పటం జరిగింది. నష్టపరిహారంగా విత్తనం ధర, దానిపై వడ్డీ చెల్లించాలా, ఆ విత్తనం వాడటంవలన ఒక పంటకాలాన్ని, తద్వారా కోల్పోయిన దిగుబడికి పరిహారం చెల్లించాలా అన్నది ముసాయిదాలో వివరించలేదు. రైతులు వినియోగదారుల ఫోరంకి వెళితే విత్తన ఖరీదు దానిపై వడ్డీ మాత్రమే పొందే అవకాశం వుంది. ఈ విషయంలో 2004, 2019 ముసాయిదా బిల్లుల్లో ఒకేవిధంగా వుంది.

2004 విత్తన ముసాయిదా బిల్లులో విత్తన ధరల నిర్ణయాన్ని రాష్ట్రాలకు లేకుండా చేస్తే, 2019 విత్తన ముసాయిదాలో ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ధరలను నియంత్రించే అధికారం కమిటీకి వుంటుందని చేసిన సవరణ ఆచరణలో ధరల నియంత్రణకు అవకాశం లేకుండాపోతుంది.

యుపిఏ, ఎన్‌డిఏ ప్రభుత్వాల విత్తన ముసాయిదా బిల్లుల్లో వున్న సారాంశం ఒక్కటే. ఒకే అర్థం వచ్చేలా కొన్ని పదాల్లో మార్పులు వున్నాయి. కొత్త సీసాలో పాత సారాయి నింపిన విధంగా వుంది. రెంటిలోనూ రైతు ప్రయోజనా లను హరించి, బహుళజాతి ప్రయోజనాలు కాపాడేవిగానే వున్నాయి. 2019 ముసాయిదా చట్టం, చట్టంగా మారితే వ్యవసాయరంగ సంక్షోభాన్ని ఇంకా తీవ్రతరం చేస్తుంది.

దేశీయ వ్యవసాయరంగంపై సామ్రాజ్య వాదుల, బహుళజాతి విత్తన సంస్థల ఆధిపత్యం కొనసాగుతున్నది. దాన్ని పరిరక్షించటమే ధ్యేయంగా పెట్టుకొన్న దేశీయ పాలకులు స్వతంత్ర వ్యవసాయరంగ విధానాలను సాంప్రదాయ విత్తనాల అభివృద్ధికి, ఉత్పత్తులకు సంబంధించిన విధానాలను అమలుజరపలేక పోయారు. బహుళజాతి సంస్థ వ్యాపారానికి ద్వారాలు బార్లా తెరిచివుంచారు, చట్టాలు చేస్తున్నారు. 2004, 2019 విత్తన ముసాయిదా బిల్లులు అందుకు నిదర్శనాలే. ఈ ముసాయిదాల్లో దేశీయ విధానం గురించిగానీ, విత్తన ఉత్పత్తిగురించి ప్రస్తావనే లేదు. దీన్ని రైతాంగం అర్థంచేసుకొని వ్యవసాయరంగంపై సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల జోక్యం తొలగించాలనీ, దేశీయ వ్యవసాయరంగ విధానాలు అమలుచేసి, విత్తనాల అభివృద్ధికి, ఉత్పత్తుల పెంపుదలకు శాస్త్రవేత్తలను ప్రోత్సహించాలని, బిటి విత్తనాలను నిషేధించాలని యావన్మంది రైతాంగం ఉద్యమించాలి.

ooo